www.kalamjyothi.com

కలం జ్యోతి

తెలుగు దినపత్రిక

గురువారం
01.10.2026





సిరిసిల్లలో గెలిపిస్తే మంత్రిని చేస్తా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఢిల్లీని ఒప్పించి మంత్రివర్గంలోకి తీసుకుంటా
- వెయ్యి రోజుల ప్రజాపాలనలో నేతన్నల కోసం రూ.1,741 కోట్లు ఖర్చు
- గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక పాలసీ అమలు
- సిరిసిల్ల బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.1,700 కోట్ల నిధులు మంజూరు

5లో..





విద్యారంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం

- ప్రయోగాత్మకంగా బాహ్య మూల్యాంకనానికి సిద్ధం
- మార్చి తర్వాతే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు

4లో..


- 6వ తరగతి విధానంపై అభ్యంతరం: ఎస్టీయూ

హరీష్‌రావుతో పెద్ది స్వప్న భేటీ

- నర్సంపేట రాజకీయ పరిస్థితులపై చర్చ
- క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు ప్రాధాన్యం
- త్వరలోనే కేటీఆర్‌తో కలిసి ప్రత్యేక సమీక్ష
- ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న నేతలు

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తన్నీరు హరీశ్ రావుతో వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి జరిపిన తాజా భేటీ నర్సంపేట నియోజకవర్గ గులాబీ శ్రేణుల్లో సరికొత్త రాజకీయ ఉత్తేజాన్ని నింపింది. దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డితో ఉన్న ఉద్యమ అనుబంధాన్ని నెమరువేసుకుంటూనే, నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత పటిష్టత, భవిష్యత్ కార్యాచరణ, త్వరలోనే వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి నిర్వహించనున్న కీలక సమీక్షా సమావేశంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించడం స్థానిక రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

6లో..



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
గురువారం 01.10.2026
2
www.kalamjyothi.com

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 30) : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో అందేలా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఆదేశించారు. బుధవారం బిజినపల్లి మండలం నంది వడ్డేమాన్ గ్రామంలోని స్థానిక పోస్టాఫీస్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి, ఆసరా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పోస్టాఫీస్ ద్వారా గ్రామంలో పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ సొమ్ము ప్రతి నెలా సమయానికి అందుతోందా, నగదు తీసుకునే సమయంలో ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని అక్కడ ఉన్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు ఎరుకలి బాలమ్మ, దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారు మ్యాతరి బుచ్చయ్యలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.



దివ్యాంగుడి సమస్యపై సానుకూల స్పందన..

ముఖాముఖి సందర్భంగా దివ్యాంగ లబ్ధిదారు మ్యాతరి బుచ్చయ్య మాట్లాడుతూ తనకు నెలనెలా పింఛన్ అందుతోందని చెబుతూనే, నివాసం ఉండేందుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు నడవడానికి వీల్‌చైర్ ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్, నిబంధనల ప్రకారం ఆయన అర్హతలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు తదితర వర్గాలకు ఈ పింఛన్లు ఎంతో ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు సకాలంలో చేరేలా నిరంతరం పర్యవేక్షించాలని, పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ అధికారులు సమన్వయంతో బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లాటరీపై ఉత్కంఠ

- 192 మంది లబ్ధిదారులకు నంబర్ల కేటాయింపు
- అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 30) : పేదలకు కేటాయించే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నంబర్ల ఖరారు ప్రక్రియపై లబ్ధిదారుల్లో సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఇప్పటికే ఎంపికైన 192 మంది లబ్ధిదారులకు నిర్దిష్టంగా ఏ ఇంటి నంబర్ దక్కనుందనే అంశంపై గురువారం లాటరీ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా కేంద్రంలోని నెల్లికొండ గేట్ సమీపంలో ఉన్న వెలమ ఫంక్షన్ హాల్ వేదికగా అక్టోబర్ 1న ఉదయం 11 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఎంపికైన లబ్ధిదారుల పేర్లతో చీటీలను సిద్ధం చేసి, లాటరీ ద్వారా ఒక్కొక్కరి పేరు తీస్తూ ఇంటి నంబర్‌ను నిర్ణయించనున్నారు.



ఆ వార్డు లబ్ధిదారుపైనే స్థానికంగా ఆసక్తి..

మరోవైపు పట్టణంలోని ఒక వార్డుకు సంబంధించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై స్థానికంగా ప్రత్యేక చర్చ నడుస్తోంది. గతంలో ఆ వార్డుకు ప్రాతినిధ్యం వహించిన మాజీ కౌన్సిలర్‌కు సన్నిహితంగా ఉన్న వ్యక్తి కూడా ఎంపికైన జాబితాలో ఉన్నట్లు ప్రచారం సాగుతుండటంతో, లాటరీలో ఆ వ్యక్తికి ఏ నంబర్ ఇల్లు దక్కుతుంది, కేటాయింపు ప్రక్రియ ఎంతవరకు నిష్పాక్షికంగా సాగుతుంది, ఈ పరిణామాలు ఎలాంటి చర్చకు దారితీయను న్నాయనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అక్టోబర్ 1న జరిగే లాటరీతో వీటన్నింటికీ సమాధానం లభించనుండగా, అధికారులు పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రణాళికే విజయానికి అసలైన పునాది

మోటివేషనల్ స్పీకర్ మాడే లోకనాథం

కలంజ్యోతి, నర్సాపూర్ (సెప్టెంబర్ 30) : నేటి పకడ్బందీ ప్రణాళికే రేపటి ఉజ్వల విజయానికి అసలైన పునాది అని నస్తీపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ మాడే లోకనాథం విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. హత్నూర మండలంలోని బోరుపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాజు ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం ఉదయం ప్రత్యేక ప్రేరణ తరగతిని నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులకు సందేశమిస్తూ, నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకుని టైమ్ మేనేజ్‌మెంట్, మెమరీ టిప్స్, పరీక్షల పట్ల సానుకూల దృక్పథం అలవర్చుకోవడం వంటి కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చదవాలని, పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కొని ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి, లక్ష్యసాధన పట్ల పట్టుదల, సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే ఈ తరగతి ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్

శాంతిభద్రతల పరిరక్షణకే ప్రాధాన్యం
ముందస్తు అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిషేధం

ఎస్పీ జానకి షర్మిల

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 30) : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా ప్రశాంతతను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా అక్టోబర్ నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులు అమల్లో ఉన్న సమయంలో సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని, పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడే కార్యక్రమాలు చేపట్టకూడదని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించి ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారాలు, వదంతులు



వ్యాప్తి చేయడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం, సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు, వీడియోలు, సందేశాలు ప్రసారం చేసే వారిపై కూడా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ పోలీసు శాఖకు సంపూర్ణంగా సహకరించాలని, బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పౌరులంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.



పరిశుభ్రత మనందరి బాధ్యత

ఎంపీడీవో యూసుఫ్

కలంజ్యోతి, నర్సాపూర్ (సెప్టెంబర్ 30) : నిరంతరం పారిశుద్ధ్య చర్యలు పకడ్బందీగా పాటిస్తూ గ్రామాలను ఆదర్శ స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దాలని హత్నూర ఇన్‌చార్జ్ ఎంపీడీవో యూసుఫ్ పిలుపునిచ్చారు. బుధవారం నాడు హత్నూరలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, పారిశుద్ధ్య కార్మికులకు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి, వాటి స్థానంలో క్లాత్ సంచులను వినియోగించాలని సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగిస్తూ మురుగు కాల్వలను శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

గురువారం 01.10.2026

www.kalamjyothi.com



సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తాం

చైర్మన్ మొగిలి వెంకట్‌రెడ్డి

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 30) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పాలకవర్గ సభ్యులందరి సమష్టి కృషితో పాటు రైతుల సహకారం ఎంతో అవసరమని సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ 72వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఆయన అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో స్వల్పకాలిక రుణాలు తీసుకుని, వాటిని గడువులోగా సకాలంలో తిరిగి చెల్లించిన రైతులకు 3 శాతం వడ్డీ రాయితీ రూపంలో తిరిగి లభిస్తుందని స్పష్టం చేశారు. రైతులంతా సకాలంలో రుణాలు చెల్లిస్తూ సంఘం అభివృద్ధికి సంపూర్ణంగా తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో అమీనాబాద్ గ్రామానికి యూనియన్ బ్యాంక్ నూతన బ్రాంచ్ మంజూరైందని తెలిపారు. ఆ బ్యాంక్ కార్యకలాపాల నిర్వహణ కోసం సంఘానికి చెందిన గదులను లీజుకు కేటాయిస్తున్నామని, సొసైటీ పురోభివృద్ధికి పాలకవర్గం నిరంతరం పాటుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సిద్దన రమేష్, సర్పంచ్ దార రంజిత్, ఉప సర్పంచ్ బండి హరీష్, నెక్కొండ సర్కిల్ సహకార అధికారి సీనియర్ ఇన్స్పెక్టర్ దార విమల, డైరెక్టర్లు ఊరుగొండ లింగస్వామి, మంద యాకయ్య గౌడ్, బొంపల్లి ప్రసాద్, మంద సోమయ్య, అంబాల రవి, రాదరపు బిక్షపతి, పెంతల రమ, జోరు వీరయ్య, భూక్య నీల, పానుగంటి వీరమ్మ, దరావత్ భద్రు, రైతులు, సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం

స్టార్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవం

అధ్యక్షుడిగా బండారి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జంగిలి రాజు

కలంజ్యోతి, నల్లబెల్లి (సెప్టెంబర్ 30) : జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల శాశ్వత పరిష్కారంతో పాటు ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకురావడమే ధ్యేయంగా నల్లబెల్లి మండల కేంద్రంలో స్టార్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో స్టార్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బండారి భాస్కర్ (నమస్తే తెలంగాణ), ప్రధాన కార్యదర్శిగా జంగిలి రాజు (ఆదాబ్ హైదరాబాద్), కోశాధికారిగా మామిండ్ల వీరారెడ్డి (మనం), గౌరవ అధ్యక్షుడిగా ఎం.డి. చాంద్ పాషా (ఆంధ్రప్రభ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా గుండెకారి మోహన్ రావు (వి6 వెలుగు), అత్తే నవీన్ (దిశ) లతో పాటు పలువురు పత్రికా విలేకరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బండారి భాస్కర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా పాత్రను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. మండలంలో విలేకరుల మధ్య సమన్వయాన్ని, ఐక్యతను పెంపొందిస్తూ వృత్తిపరమైన గౌరవాన్ని కాపాడేందుకు పాలకవర్గ సభ్యులందరం సమష్టిగా పనిచేస్తామని వివరించారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 30) : రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్‌తో కలిసి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో సమీక్షించారు. ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, మార్కింగ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, హెల్మెట్, సీటుబెల్ట్ లేకపోవడంపై దృష్టి సారించి తనిఖీలు ముమ్మరం చేయాలని, విద్యాసంస్థల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

రహదారుల ఆక్రమణలు తొలగించాలి..

రహదారుల ఇరువైపులా ఉన్న అక్రమ ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. భద్రతా పనులను 50 రోజుల్లో పూర్తి చేస్తామని ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు. ముఖ్యంగా బిజినపల్లి మండలంలో రహదారి ఆక్రమణలను తొలగించి ప్రజలు, వాహనదారులకు సురక్షిత రాకపోకలు కల్పించాలని స్పష్టం చేశారు.

ముమ్మరంగా తనిఖీలు

ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్

నాగర్‌కర్నూల్‌బిజినపల్లి మార్గంలోని నూతన బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్ మాట్లాడుతూ పోలీస్ శాఖ తరఫున తనిఖీలు ముమ్మరం చేస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ అన్ని శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని తెలిపారు.

6న ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనానికి భారీగా తరలిరావాలి

నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దిగంబర్

కలంజ్యోతి, నర్సాపూర్ (సెప్టెంబర్ 30) : అక్టోబర్ 6వ తేదీన నర్సాపూర్ పట్టణ పరిధిలోని సాయి కృష్ణ గార్డెన్‌లో నిర్వహించనున్న నర్సాపూర్ నియోజకవర్గ ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దిగంబర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మేళనానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ముదిరాజ్ బంధువులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చేలా బాధ్యులు చొరవ చూపాలని కోరారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ముదిరాజ్ నాయకులంతా రాజకీయ పార్టీలకతీతంగా ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, కాసాని జ్ఞానేశ్వర్, కాసాని వీరేశం హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.



అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయం

గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి

కలంజ్యోతి, నర్సంపేట (సెప్టెంబర్ 30) : చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం, మహిళల సంక్షేమంలో క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు అందిస్తున్న నిస్వార్థ సేవలు ఎంతో అభినందనీయమని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి కొనియాడారు. సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా నర్సంపేట పట్టణంలో నిర్వహించిన అంగన్ మిలన్ సేవా కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయా వర్కర్లు, ఆశా కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు సమయానికి పోషకాహారం, అత్యవసర వైద్య సేవల పర్యవేక్షణ అందించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. చిన్నారులకు ప్రాథమిక దశ నుంచే సరైన పౌష్టికాహారం అందించడం ద్వారానే సమాజంలో ఆరోగ్యవంతమైన భావి తరాలను నిర్మించవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి, వాటి సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ఇన్‌చార్జ్ సిరికొండ కవిత, జిల్లా అధ్యక్షురాలు టేకుమట్ల రేణుక, నాయకులు కొప్పిరాల శైలశ్రీ, శోభ, మార్తా ఉషారాణి, బీజేపీ ఫ్లోర్ లీడర్ జూలూరి రోజారాణి, కళ్యాణి, సౌందర్య, కార్యక్రమ కన్వీనర్ సూత్రపు సరిత, పలువురు బీజేపీ నాయకులు, మహిళా మోర్చా ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.







కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
గురువారం 01.10.2026
www.kalamjyothi.com

విద్యారంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం



కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 30) : రాష్ట్ర విద్యా వ్యవస్థలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో గురువారం నుంచి ప్రారంభం కానున్న సమ్మేటివ్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదివే విద్యార్థులకు పదో తరగతి తరహాలోనే బాహ్య మూల్యాంకన విధానాన్ని అమలు చేయనున్నారు. పదో తరగతి లాగే పరీక్షా పత్రాల నిర్వహణకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయనుండగా, ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ గత నెలలోనే అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

మార్చి తర్వాతే

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు..

బుధవారం సాయంత్రం విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్టీయూ పక్షాన ప్రస్తావించిన పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9వ తరగతి సమ్మేటివ్ పరీక్షలకు మాత్రమే బాహ్య మూల్యాంకనం నిర్వహించాలని, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాలతో పాటు గిరిజనులు అధికంగా ఉండే కొన్ని జిల్లాల్లో 6వ తరగతికి కూడా బాహ్య మూల్యాంకనం చేపట్టాలని నిర్ణయించారు. వచ్చే మార్చిలో పదో తరగతి పరీక్షల అనంతరం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టడంతో పాటు 190 జీవో అమలు, సమగ్ర శిక్ష సిబ్బంది బదిలీ, షిఫ్టింగ్ అంశాలపైతగిన చర్యలు తీసుకుంటారు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్న పాఠశాలల్లో అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను మంజూరు చేయాలని, ఆంధ్రప్రదేశ్‌లో అమలులో ఉన్న విధానానికి అనుగుణంగా తెలంగాణలో కూడా ఉపాధ్యాయ బదిలీలకు ప్రత్యేక చట్టం తెచ్చే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు.

6వ తరగతి విధానం

పైలట్ ప్రాజెక్ట్ మాత్రమే: ఎస్టీయూ

ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సదానంద గౌడ్, జుట్టు గజేందర్ కలంజ్యోతితో మాట్లాడుతూ 9వ తరగతికి బాహ్య మూల్యాంకన విధానం వల్ల విద్యార్థులకు పదో తరగతి పరీక్షలంటే భయం పోవడంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని వివరించారు. ఇక 6వ తరగతి మూల్యాంకనం కేవలం పైలట్ ప్రాజెక్ట్ మాత్రమేనని, ఆ తరగతికి ఈ విధానాన్ని అమలు పరచడాన్ని తాము అంగీకరించలేదని స్పష్టం చేశారు. అయితే ఇది ప్రయోగాత్మక విధానం అయినందువల్ల, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే మాత్రమే తాము ముందుండి ఉద్యమిస్తామని వారు తేల్చిచెప్పారు.

కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంపై విమర్శలు

విద్యార్థికి ఫిట్స్ వచ్చినా పట్టించుకోని వైనం



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 30) : జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థికి అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురై ఫిట్స్ రాగా, కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అత్యవసరంగా విద్యార్థిని ఆసుపత్రికి తరలించాల్సిన సమయంలో యాజమాన్యం సరైన రీతిలో స్పందించకపోవడంతో, తోటి విద్యార్థులే మానవతా దృక్పథంతో వెంటనే ఒక ఆటోను మాట్లాడి బాధిత విద్యార్థిని నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. విద్యార్థుల ప్రాణాలు, ఆరోగ్యం విషయంలో ప్రైవేట్ కళాశాల యాజమాన్యం చూపిన ఉదాసీనతపై సర్వత్రా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై విద్యాశాఖ, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

గిరిజనుల సమస్యల తక్షణ పరిష్కారం

అధికారులు స్పందించకుంటే ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించాలి

జాటోతు హుస్సేన్ నాయక్



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 30) : గిరిజనుల సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం అత్యంత వేగంగా స్పందించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం గిరిజనులు ముందుగా సంబంధిత స్థానిక అధికారులకు, ప్రజావాణి వేదిక ద్వారా ఫిర్యాదు చేయాలని, అక్కడ న్యాయం జరగకపోతే జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని ముక్కిడి గుండం, జిల్లర్ తిప్ప, తెల్లరాళ్లపల్లి తాండా, ఠాగూర్ తాండా, ఎత్తం గుట్ట, జొన్నల బోగడ తాండాల్లో ఆయన పర్యటించారు. గిరిజనులతో నేరుగా ముఖాముఖి మాట్లాడి పోడు భూముల సాగు, హక్కు పత్రాలు, సాగునీటి వనరులు, రహదారులు, ఇళ్ల నిర్మాణ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి గిరిజన సంక్షేమం, వైద్యం, పంచాయతీరాజ్, అటవీ, రెవెన్యూ, విద్య తదితర శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం..

గిరిజనుల అవసరాలకు అనుగుణంగా అధికారులు బాధ్యతతో పనిచేయాలని, జాతీయ గిరిజన పోర్టల్ ద్వారా అందే ప్రతి దరఖాస్తును యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని హుస్సేన్ నాయక్ తెలిపారు. చెంచు గిరిజనుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, తమ దృష్టికి వచ్చిన సమస్యలను రాష్ట్రస్థాయిలో చర్చించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తాండాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, ఇళ్ల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఎత్తం గుట్ట దేవాలయ అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తామని, అక్కడికి అటవీ శాఖ అనుమతులతో రోడ్డు నిర్మించాలని సూచించారు.

గిరిజన సంఘాల నాయకులు ఇచ్చిన వినతులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట సబ్‌కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవసహాయం, జిల్లా రెవెన్యూ అధికారి పాండు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటయ్య, వివిధ శాఖల అధికారులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.



నేరెళ్ల బాధితులకు ఆర్థిక భరోసా

సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పరిహారం చెక్కుల పంపిణీ

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 30) : ఏళ్ల తరబడి న్యాయం కోసం నిరీక్షిస్తున్న సిరిసిల్ల నేరెళ్ల బాధితులకు ప్రజాపాలన ప్రభుత్వం కొండంత అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించింది. సిరిసిల్లలో నిర్వహించిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవ భారీ బహిరంగ సభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా బాధితులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. బాధితులైన పెంట బాణయ్య, కోల హరీశ్‌లకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అలాగే గంధం లావణ్య, చెప్పాల బాలరాజు, పసుల ఈశ్వర్‌కుమార్, కోరికంటి గణేశ్, చీకోటి శ్రీనివాస్, బత్తుల మహేశ్‌లకు తలా రూ.5 లక్షల చొప్పున పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులతో పాటు కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల జిల్లా అధికార యంత్రాంగం తరపున కలెక్టర్ సీఎంకు జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘకాలం తర్వాత తమ బాధలను గుర్తించి ప్రభుత్వం అండగా నిలవడంపై బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

నిరుపేద కుటుంబానికి సమితి చేయూత



కలంజ్యోతి, నర్సంపేట (సెప్టెంబర్ 30) : అనారోగ్యంతో పెద్దదిక్కును కోల్పోయి వీధినపడిన నిరుపేద కుటుంబానికి పీఆర్ ముదిరాజ్ సేవా సమితి కొండంత అండగా నిలిచింది. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని మాదన్నపేట గ్రామానికి చెందిన వేములపల్లి అయిలయ్య ముదిరాజ్ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందడంతో, సమితి జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో, కష్టాల్లో ఉన్న నిరుపేద ముదిరాజ్ కుటుంబాలకు తమ వంతు బాధ్యతగా సాయం అందించి ఆదుకోవడమే సమితి ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. సమాజంలో ముదిరాజ్‌లంతా పరస్పరం ఐక్యంగా ఉంటూ, ఉన్నత స్థాయికి ఎదిగి ఇతరులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగారపు రామకృష్ణ ముదిరాజ్, కొలిపాక నాగరాజు, దండు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

తాడిచెట్టుపై నుంచి పడి కార్మికుడికి గాయాలు



కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 30) : కుల వృత్తిలో భాగంగా తాడిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడి కల్లుగీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన ఘటన చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గీత కార్మికుడు అంబాల రవి తాడిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు పట్టుతప్పి కిందపడిపోవడంతో చేయి విరిగి తీవ్ర గాయమైంది. ప్రమాదాన్ని గమనించిన తోటి కార్మికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది పైలట్ వైనాల నాగరాజు, ఈఎంటీ ప్రవీణ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని రవికి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితుడిని 108 అంబులెన్స్‌లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

5

గురువారం 01.10.2026

www.kalamjyothi.com



దళితులను చిన్నచూపు చూడొద్దు

డిప్యూటీ తహసీల్దార్ ఇంజమూరి పవన్

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 30) : సమాజంలో దళితులను ఎవరూ చిన్నచూపు చూడకూడదని, అంటరానితనం పాటించడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ తహసీల్దార్ ఇంజమూరి పవన్ పేర్కొన్నారు. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నివసించే దళితులను ఇతర కులాల వారు వివక్షతో చూడరాదని, రాజ్యాంగం ప్రకారం సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమేనని స్పష్టం చేశారు. ఎవరైనా దళితుల పట్ల వివక్ష చూపినా, చిన్నచూపు చూసినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని, అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంటరానితనం నిర్మూలనపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు

16 చింతల తండాలో కార్డుల పంపిణీ

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 30) :అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా చేరేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సర్పంచ్ విక్రమ్ తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని పదహారు చింతల తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అర్హులైన కుటుంబాలకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా రేషన్ పంపిణీ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరేలా అధికార యంత్రాంగం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

రేషన్ వ్యవస్థలో పారదర్శకతే ధ్యేయం..

గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేషన్ ద్వారా అవసరమైన నిత్యావసర సరుకులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నాయకులు వివరించారు. స్మార్ట్ కార్డుల విధానం ద్వారా రేషన్ వ్యవస్థలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందుతాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేశ్, మాజీ సర్పంచ్ గణేష్, వార్డు సభ్యులు కేశ్య, నంద, నర్సింహ, గ్రామస్థులు జెత్య, రాజీ, బోజ్య, చందు, మాజీ కారోబార్ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.





సిరిసిల్లలో గెలిపిస్తే మంత్రిని చేస్తా

కలంజ్యోతి, రాజన్న సిరిసిల్ల (సెప్టెంబర్ 30) : రాబోయే ఎన్నికల్లో సిరిసిల్లలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే హైకమాండ్‌ను ఒప్పించి మంత్రివర్గంలోకి తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లాలో పర్యటించిన ఆయన రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అంతకుముందు హెలిపాడ్ వద్ద కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ జి. మహేష్‌బాబా సాహెబ్ ఆయనకు స్వాగతం పలకగా, అంబేద్కర్ చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు పాదయాత్ర చేపట్టారు. నేత బజారు, సిరిసిల్ల, వేములవాడలలో రూ.200 కోట్ల చొప్పున యంగ్ ఇండియా పాఠశాలలు, రాజన్న ఆలయానికి రూ.99.40 కోట్ల పనులు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలు, మహిళా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించారు. అనంతరం సభలో మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల ఉరిసిల్లగా మారిందని, గల్ఫ్ కార్మికులు మరణిస్తే రూ.5 లక్షల సాయం అందించే పాలసీని ప్రజా ప్రభుత్వం తెచ్చిందన్నారు. నేతన్నల కోసం రూ.1,741 కోట్లు ఖర్చు చేశామని, జిల్లాకు రూ.1,700 కోట్లు కేటాయించామని తెలిపారు.

తెలంగాణలో మళ్లీ ప్రజాపాలనే వస్తుంది

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

రాష్ట్రంలో ప్రజాపాలన 2 ఖచ్చితంగా వస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యే ఆస్తులు ప్రతి ఎన్నికకు ఎలా పెరుగుతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. నేరెళ్ల ఘటన సమయంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్‌ను అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేశారు. కోట్ల జీతాలు తీసుకుంటున్న ప్రతిపక్ష నేతలు ఫామ్‌హౌస్‌లకే పరిమితమయ్యారని, రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే కులగణన చేపట్టి బీసీల సంక్షేమానికి బాటలు వేశామన్నారు.

నేతన్నలకు పూర్వవైభవం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రైతన్న అన్నం పెడితే, నేతన్న సమాజ గౌరవాన్ని కాపాడుతున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గత పాలకులు పెండింగ్‌లో పెట్టిన రూ.500 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించిందని, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా రూ.50 కోట్ల రుణాలు మాఫీ చేశామన్నారు. వేములవాడలో రూ.50 కోట్లతో నూలు డిపో తెచ్చామని, ఏడాది పొడవునా పనులు కల్పిస్తున్నామని తెలిపారు.

రైతులు, కార్మికుల సంక్షేమమే ధ్యేయం

మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే ప్రజా సంక్షేమం, నేతన్నల ఉన్నతి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతిపక్షాలు సభా సమయాన్ని దుర్వినియోగం చేస్తూ కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తే, తమ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి బాటలు వేస్తోందన్నారు.

హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. ఎన్నికల వేళ ఇచ్చిన గ్యారెంటీలను ముఖ్యమంత్రి ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. నేరెళ్ల బాధితులకు న్యాయం చేసేందుకు తమ ప్రభుత్వం రాగానే చర్యలు తీసుకున్నామని, గత కాంగ్రెస్ హయాంలోనే ప్రాజెక్టులు కట్టి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశామని గుర్తుచేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఉన్నతికి కృషి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

బాధితులకు ముఖ్యమంత్రి స్వయంగా పరిహారం చెక్కులు అందించడం అభినందనీయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కరకట్ట వద్ద ఉన్న 300 ఎకరాల భూమిని పేదలకు కేటాయించేలా ఆదేశాలివ్వాలని కోరారు. బడుగు వర్గాల పిల్లల ఉన్నత చదువుల కోసం రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాలలు నిర్మిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సిరిసిల్లను సమగ్రంగా అభివృద్ధి చేస్తాం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ముఖ్యమంత్రి పర్యటనతో సిరిసిల్ల సరికొత్త అభివృద్ధి బాట పట్టిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లాలో రూ.1,000 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వేములవాడ ఆలయానికి రూ.250 కోట్లు కేటాయించామన్నారు. అనంతరం నేరెళ్ల బాధితులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను ముఖ్యమంత్రి అందించారు. కలెక్టర్ సీఎంకు జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక సలహాదారులు సుదర్శన్ రెడ్డి, ఎంపీలు వేమూరి నరేందర్ రెడ్డి, మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మదన్‌మోహన్ రావు, లక్ష్మీకాంతరావు, డాక్టర్ సంజయ్, శ్రీగణేష్, నాగరాజు, కుంభం అనిల్ రెడ్డి, నవీన్ యాదవ్, సంపత్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

బాధిత పిల్లలకు ఉచిత న్యాయ సహాయం

జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి రవీందర్

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 30) : ప్రత్యేక అవసరాలున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని సాధారణ సమాజంతో సమానంగా జనజీవన స్రవంతిలో చేరేలా ప్రతి ఒక్కరూ చూడాలని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి రవీందర్ సూచించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఒక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల హక్కులు, వారికి చట్టం ద్వారా రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక వసతుల గురించి సమగ్రంగా వివరించారు. దివ్యాంగ పిల్లలకు ఏదైనా అన్యాయం జరిగితే నేరుగా న్యాయసేవా సంస్థను ఉచితంగానే సంప్రదించవచ్చని, వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని భరోసా ఇచ్చారు.

ప్రతిభను గుర్తించి

భవిష్యత్తుకు బాటలు వేయాలి..

జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ రాథోడ్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రత్యేక ప్రతిభను గుర్తించి, సరైన చదువు అందించి వారి బంగారు భవిష్యత్తు కోసం నిరంతరం కృషిచేయాలన్నారు. డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల లక్షణాలు, వైకల్యం రావడానికి గల కారణాలు, తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు, సమాజంలో వారి పట్ల ఉండవలసిన మానవతా దృక్పథంపై అవగాహన కల్పించారు. అనంతరం డీఈవో భోజన్న మాట్లాడుతూ ఇలాంటి పిల్లల తల్లిదండ్రులకు సరైన అవగాహన ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విలీన విద్య సమన్వయకర్త ఎన్. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
గురువారం 01.10.2026
6
www.kalamjyothi.com



హరీష్‌రావుతో పెద్ది స్వప్న భేటీ

కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 30) : తెలంగాణ ఉద్యమ ప్రస్థానం నుంచి పార్టీ బలోపేతం వరకు నిరంతరం ప్రజాక్షేత్రంలో పనిచేసిన నాయకత్వంతో సమన్వయం కొనసాగుతుందని వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తన్నీరు హరీశ్ రావును బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య పలు ఆసక్తికర అంశాలపై సుదీర్ఘంగా చర్చ సాగింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయం నుంచి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డితో హరీశ్‌రావుకు ఉన్న గాఢమైన అనుబంధం, ఉద్యమ రోజుల్లో కలిసి పనిచేసిన పలు చారిత్రక ఘట్టాలు, గత మధుర జ్ఞాపకాలను ఈ భేటీలో ఇరువురు ఎంతో భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. అనంతరం ఇరు కుటుంబాల యోగక్షేమాలను పరస్పరం అడిగి తెలుసు కున్నారు.

నర్సంపేట రాజకీయ పరిస్థితులపై చర్చ..

ఈ సమావేశంలో కేవలం కుటుంబ బాగోగులే కాకుండా, నర్సంపేట నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో గులాబీ శ్రేణులను ఏ విధంగా ముందుకు నడిపించాలి, ప్రజా సమస్యలపై ఎలా పోరాడాలనే అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ కేడర్ ఎంతో పటిష్టంగా ఉందని, నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లవేళలా వెన్నంటి ఉంటుందని ఈ సందర్భంగా హరీశ్‌రావు భరోసా ఇచ్చారు.

త్వరలోనే కేటీఆర్‌తో కలిసి ప్రత్యేక సమీక్ష..

నర్సంపేట నియోజకవర్గ సమగ్ర రాజకీయ పరిస్థితులపై త్వరలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి ఒక ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తామని హరీశ్‌రావు పేర్కొన్నట్లు తెలిసింది. నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, కీలక బాధ్యులతో హైదరాబాద్‌లోనే త్వరలో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి, భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ఖరారు చేస్తామని తెలిపారు. పార్టీకి కంచుకోటగా ఉన్న నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ జెండాను మరింత సగర్వంగా ఎగరేసేందుకు నాయకులంతా సమష్టిగా, సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.



అటవీ గ్రామాల పునరావాసానికి చర్యలు

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్


కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 30) : నల్లమల్ల అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ ఏరియాలోని గిరిజన కుటుంబాల స్వచ్ఛంద పునరావాస ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. సార్లపల్లి, కుడిచింతలపల్లి, తాటిగుండాల, కొల్లంపెంట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పెద్దకొత్తపల్లి మండలం బాచారం వద్ద బుధవారం ఆయన ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. అడవుల నుంచి మైదాన ప్రాంతాలకు తరలివచ్చే వారికి సురక్షిత నివాసం, మెరుగైన జీవనం కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

257 కుటుంబాలకు స్థలాలు,
160 కుటుంబాలకు ప్యాకేజీ

మొత్తం 417 నిర్వాసిత కుటుంబాలకు నిబంధనల ప్రకారం ప్యాకేజీ అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఇందులో 257 కుటుంబాలకు 250 గజాల చొప్పున ఇంటి స్థలాలు ఇవ్వగా, మరో 160 కుటుంబాలు రూ.15 లక్షల నగదు ప్యాకేజీని ఎంచుకున్నాయని వెల్లడించారు. వీరికి మైదాన ప్రాంతంలో జీవనోపాధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అధికారులు నిరంతరం సహకరిస్తారని భరోసా ఇచ్చారు.

పునరావాస కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి..

బాచారం కాలనీలో మిషన్ భగీరథ నీరు, విద్యుత్, సీసీ రోడ్లు, డ్రైనేజీ వసతులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నిర్వాసిత కుటుంబాలకు సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందేలా చూడాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, సంక్షేమ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 30) : భూముల సరిహద్దులు, రికార్డుల్లో పూర్తి స్పష్టత తేవడమే రీ సర్వే ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. బిజినపల్లి మండలం ఖానాపూర్‌లో కొనసాగుతున్న భూముల రీ సర్వేను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. గ్రామంలోని 2,525 ఎకరాల 15 గుంటల భూమిని రీ సర్వే పరిధిలోకి తెచ్చి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా హద్దులు గుర్తిస్తూ మ్యాప్‌లను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల భవిష్యత్తులో భూ వివాదాలు సమసిపోతాయని, ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి..

అనంతరం ఖానాపూర్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించి వసతులపై ఆరా తీశారు. 124 మంది విద్యార్థులు ఉన్నందున అదనపు తరగతి గదులు లేదా నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరగా, స్థలాన్ని పరిశీలించి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బిజినపల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో, సర్పంచ్ ఇందిర, ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

తహసీల్దార్‌కు ఎంసీపీఐ(యూ) వినతిపత్రం

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 30) : శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఏమాత్రం తాత్సారం చేయకుండా తక్షణమే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం చెన్నారావుపేట మండల తహసీల్దార్‌కు పలు ప్రధాన ప్రజా సమస్యలతో కూడిన సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కన్నం వెంకన్న మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4 వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, పేద మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని కోరారు. వీటితో పాటు వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, ఆటో డ్రైవర్లకు ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించాలని స్పష్టం చేశారు.

నిర్లక్ష్యం వీడకుంటే ఉద్యమాలు తీవ్రతరం..

ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి, నివాస స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

ఆక్రమణలకు గురవుతున్న విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడి, సాగుభూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు మొర్రి శ్రీనివాస్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



ధర్మన్‌లో శ్రీలీల

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ధర్మన్‌లో టాలీవుడ్ నటి శ్రీలీల కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. వరుస పరాజయాలతో ఉన్న ఆమెకు దర్శకుడు అశ్వత్ మారిముత్తు రూపొందిస్తున్న ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్ ఊహించని అవకాశంగా మారింది. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్, టర్మరిక్ మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రామ్ పోతినేని, రాశి ఖన్నా, సిమ్రాన్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఇటీవల సంప్రదాయ దుస్తుల్లో ఉన్న శ్రీలీల వీడియో లీక్ కావడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ భారీ సినిమాతో ఆమె మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కుతుందా అనేది ఆసక్తికరంగా మారింది.

